# ఓడిపోయిన శంకరం

(కథానిక)

శంకరం బి. ఏ. మొన్న మార్చిలో పాసయ్యాడు. తను చదువుకున్న పట్నంలో కలక్టరు బి. ఏ. తహసీలుదారు బి. ఏ; ఇంకా యిలాంటి దివ్య సముఖాలెన్నో బి. ఏ. పాసయినాయి. తను బి. ఏ. కలక్టరుకూడా బి. ఏ. యీభావం మనస్సులో స్ఫురించినప్పుడల్లా శంకరం మురిసిపోయేవాడు. తన ప్రక్కగా చేతులు ఊపుకొంటూ కంగారుగా నడచిపోతున్నవాళ్లంతా నమస్కారాలు పెడుతున్నట్లు భావించేవాడు. తను ఎప్పుడో ఒకప్పుడు జీవితంలో కలక్టరవక మానడు. కోటూగుడ్డ యిస్తున్నప్పుడు సామాన్య ప్రజల్లోపడి నలిగిపోవలసిన రోజులు వాటంతటవే దూరమైపోతాయి. తన చుట్టాలంతా కలక్టరుగారి చుట్టాలమని చెప్పుకుంటారు. ఇంతకాలం తనను చదివిస్తున్న మాతామహి కలక్టరుగారి మామ్మ అవుతుంది. పట్టణంలో ఉన్న కార్లలో ఏదీ అంత అందంగా లేదు. ఆలోటు తను కలక్టరై తీరుస్తాడు. తన కారు పట్టణానికే వన్నె తెస్తుంది. కంపెనీవారు అంత అందమైన కారు తయారు చెయ్యాలిగాని తన కేమిలోటు? కలక్టరంటే మాటలా? దేవుడు మేలుజేస్తే తన యిల్లు యాత్రాస్థలంగా మారవచ్చు. ప్రపంచంలో వున్న అందమైన ఆరున్నొక్క కట్టడాలలోనూ అందచందాలకు కారణమైన సుందరవస్తువులను తెచ్చి తన భవనానికి తగిలించుకుంటాడు. ఇక ప్రయాణీకులు తాజమహల్ చూడడానికి ఎక్కడకో పోనక్కరలేదు. తన భవనంలో ఒక్కభాగం చూస్తేనే అంతతృప్తి కలుగుతుంది. ఉన్నతాశయాలుండడం సామాన్యం కాదు. శంకరం సామాన్యుడైతే యింత ఉన్నతాశయా లెందుకుంటాయి?

శంకరం చిన్నతనంలో తల్లిదండ్రులు కాలంజేశారు. శంకరం తండ్రి యిల్లరకపు టల్లుడు. శంకరం మాతామహి భూకామందురాలు. అందుకే శంకరం మొగాడైఉండి అనాథుడైనా, స్త్రీ అయివుండి తా నాలోటు తీర్చగలిగింది. కుమార్తె పోయినా శంకరం జీవించివున్నాడు. మాతృహృదయంలో కరడుగట్టిన ప్రేమంతా కరగి శంకరాన్ని ఆధారంజేసుకొని అతని చుట్టూ ప్రదక్షిణాలు చేసింది. దానితో శంకరం బి. ఏ. పాసై కూర్చున్నాడు. శంకరం చదువుతున్నప్పుడే పెండ్లికొడుకును చేద్దామని చాలమంది కన్యాదాతలు ప్రయత్నించారు. కాలం మారిపోయే కొద్దీ మనుషులకు వింత వింత అనుభవాలు కలుగుతుంటాయి. తాము నమ్మిందే కాదనుకుంటారు. పరిస్థితుల మార్పుతో మళ్ళీ తమ నమ్మకాన్ని తృణీకరిస్తారు. ఏదెలా ఉంటేనేం ముసలమ్మ మొట్టమొదట్లో శంకరం స్కూలుఫైనలు పాసైన వెంటనే పెండ్లి చేద్దామని అనుకుంది. మళ్ళీ ఆమె మనోవీథిలో ఏఏభావాలు సంభవించినవో తెలియదుగాని "విద్యానంతర వివాహం" అని నిర్ణయించుకొంది. ఆ మాట బహిరంగంగా చాలమందితో అంటూండేది. విన్నవారు "ముసలిది వెర్రిదా ఏమిటి? కట్నం పెరుగుతుందని" అని గుసగుస లాడేవారు. వాటి నిజానిజాలతో మనకు పనిలేదుగాని మొత్తంమీద శంకరం బి. ఏ. పాసయ్యేవరకూ బ్రహ్మచారిగానే ఉన్నాడు.

శంకరం చదువుతూన్నంత కాలం ప్రపంచం-మనుష్యులు-వాళ్ళ జీవితాలు యిలాంటివాట్లకు అర్థం తెలిసేది కాదు. వెంకన్న పంతులుకంటె సూర్యనారాయణగారు లెక్కలు బాగా చెబుతారు. తన డివిజనులో మాస్టారు, పిల్లలు, పక్క డివిజనులో మాస్టారు, పిల్లలకంటె తెలివైన వాళ్ళు. ప్రక్క డివిజనులో ఇంగ్లీషు ఫస్టు మార్కు ఏభై ఆరు, తన డివిజనులో ఏభైయ్యే

సత్యమూర్తి

ఐతేనేం? వాళ్ళ మాస్టరు పేపర్లు గట్టిగా దిద్దుతారు. ఎంతో బాగా వ్రాస్తేనేగాని నాలుగు మార్కులు పడవు. ఈ మేస్టారు చేతులో ఏభైమార్కులొస్తే ఆ పేపరుకే ప్రక్క డివిజను మాస్టరు చేతులో ఎనభైవస్తాయి. స్కూలు జీవితంలో యిలాంటి భావాలే శంకరాన్ని చుట్టు ముట్టి ఉండేవి.

స్కూలు జీవితం పూర్తికావచ్చింది. ముసలమ్మ చాలా వార్ధక్యానికి వచ్చింది. భూమి కౌలు వగైరాలన్నీ తన బాధ్యత క్రిందకు వచ్చినై. ఒక టేమిటి కోడి తవుడుదగ్గర నుండి, దూడగడ్డి వరకూ తను సవరించుకోవలసిందే ఇలా తీరుబాటు లేకుండా సంసార నిర్వహణలో పడి కొట్టుకొంటూంటే "అబ్బాయి! ఏదో ఒక సంబంధం ఒప్పుకోరా. ఎల్లకాలం నేను బ్రతుకుతానా? ఏదో ఒక అత్తింత గింజ నీ నెత్తినవేస్తే నాకంత బాధ ఉండదు నాయనా. చిన్నతనంనుంచీ పెంచి పెద్దవాణ్ణి చేశాను! ఒక యింటివాణ్ణి చేసి సంతోషిద్దామని సోహరా నాకు" అంటూండేది ముసలమ్మ. "ఏమంత కంగారు ఊరుకో" అనేవాడు శంకరం. అంటే శంకరానికి వివాహం మీద విరక్తి కాదు సుమండీ! శుభకార్యం పట్ల మధ్యవర్తి అవసరం కూడా ఉండాలి. మధ్యవర్తి పెట్టి పోసేదేం లేదుగాని రసాయన శాస్త్రంలో కెటాలిటిక్ ఏజెంటు వస్తూత్పత్తికి ఎంత అవసరమో అలాంటి అవసరమే మధ్యవర్తికి శుభకార్య నిర్వహణ పట్ల ఉంటుంది.

పెండ్లి కూమార్తె రూపురేఖలు, ఆ కుటుంబం యొక్క గౌరవ సంపత్తి, ధనం, సంప్రదాయం వగైరాలు కన్యాదాతే పీకరువు పెడితే అపార్థం చేసుకొంటారు. పెండ్లికుమారునితరఫు వారికీ ఇలాంటి యిబ్బందే ఉంది. "ఏరాయైతేనేం పళ్ళూడగొట్టుకోడానికి" అని పడుచు కుర్రాడెవడైనా అనాచారాలకు అడ్డుపడితే, "ఐతేనోఉంది కాదుమరి" అని అర్థంలేనివాక్యాన్నో దాన్ని అడ్డుకోగులుస్తాడో వెంట్రుకలు నెరసిన పెద్దమనిషి. ఎలాగైతేనేంలెండి మనకూ ముందుముందు వెంట్రుకలు నెరుస్తాయి కదూ! అందుకని మధ్యవర్తి అవుసరాన్ని గుర్తిద్దాం. నలుగురైదుగురు మధ్యవర్తులు సంబంధాల విషయమై ముసలమ్మతో మాట్లాడి వెళ్లేరు. శంకరం ప్రక్కగదిలో ఉండి యీ మాటలన్నీ విన్నాడు. మధ్యమధ్య పెదిమ విరవడం ఒకొక్కప్పుడు చిరునవ్వు నవ్వడం ఒకోసారి సమయంలో గోడకు చెవిజేర్చి పట్టుదల కల్పించుకొని వినడం యిలాంటి చేష్టలెన్నో చేశాడు. శంకరం యీ వికృతి చేష్టలలో ఉన్నప్పుడు ఆ యింటి పనిమనిషి అవసరంగా కంకరం ఉన్న గదిలోనికి వస్తే కళ్ళు చికిలించి చేత్తో సైగజేసి, సాగనంపాడు. ఈ కర్మకాండ పూర్తయిన తర్వాత మధ్యవర్తి తనదగ్గరకూ వచ్చాడు. వెనకాల ముసలమ్మ కూడా అనుసరించింది. "ఈడూ, జోడూ బావుంటుందమ్మా; ఆ సంగీతం, పనిపాటలు- యీ చదువూ, ఆస్తిపాస్తులు- కనివిని ఎరుగని శుభం మామ్మగారూ!" అనుకొంటూ వీధిలోకి వెళ్ళిపోయాడు మధ్యవర్తి. మధ్యవర్తి మాట్లాడిన వాక్యంలో కర్త, క్రియ వెదకినా కనబడ్డం లేదు. అలాంటివి పూర్తివాక్యాలు కావని బడిలో చెబుతారు. ఈశుభకార్యంలో ముందు వెనుకలు తెలియనివాడికి ఏవాక్యం అర్థంకాదు. తెలిసినవాళ్ళకు ఆనందాన్ని చేకూర్చుతుంది. మధ్యవర్తి అలా అన్నప్పుడు శంకరం ఎంతో సంతోషించాడు.

సీతను వెదకడం నిమిత్తం లంకకు వెళ్ళగలవాడు ఎవడా అని శ్రీరామచంద్రమూర్తి పరిశీలిస్తూంటే నేను నేనని చాలామంది చేతులెత్తారు. హనుమంతరావు అట్లానే మౌనంగా కూర్చున్నాడు. "నీకు దూకగల శక్తి ఉందోయ్" అని పదుగురూ అంటే హనుమంతరావు ఉబ్బిపోయాడు. శాస్త్రపరిభాషలో చెబితే స్వశక్తిని తెలుసుగాని లంకా ప్రవేశం చేశాడు. అలాగే మధ్యవర్తి "యీ చదువూ ఆస్తిపాస్తులు" అన్నప్పుడు శంకరం శరీరమంతా గగుర్పొడిచింది. రోమాలు వరుసగా లేచి నిలబడ్డాయి. తను బి. ఏ. కలక్టరు కూడా బి. ఏ. అన్నమాట మళ్ళీ జ్ఞప్తికొచ్చింది. తన శరీరంపంక చూచుకొని మురిసిపోయాడు. ఒక భూలోకరంభ-గానకోకిల - అలాంటి యువతికి తను భర్త కాబోతున్నాడు. ప్రపంచంలో ఉన్న శృంగారం, గానతరంగాలు తన కను